క్లుప్తంగా

ఎస్‌ఐగా ఎంపికైన అభ్యర్థికి సత్కారం



అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లి చెందిన వెంకటేష్ యాదవ్, వెంకటేశ్వరమ్మ దంపతుల కుమార్తె తారక ఎస్‌ఐ ఉద్యోగానికి ఎంపిక కావడంతో మంగళవారం సాయంత్రం జెడ్పీటీసీ సభ్యుడు ఎన్.రాజశేఖర్‌రెడ్డి ఆమెను శాలువాతో సత్కరించి మిఠాయి తినిపించారు. నిరుపేద కుటుంబానికి చెందిన తారక పట్టుదలతో ఎస్‌ఐ ఉద్యోగం సాధించినందున ఆమెను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని జెడ్పీటీసీ పేర్కొన్నారు. కార్యక్రమంలో వేణుయాదవ్, ఖాజాషెరీఫ్, చంద్రమోహన్‌రెడ్డి, భీంరెడ్డి, బాలరాజు, శ్రీధర్‌యాదవ్, మహేష్‌యాదవ్, బొడ్డు రమేష్ ఉన్నారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎస్‌ఐలుగా ఎంపికైన ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన మాజీ సైనికులు మహేందర్‌రెడ్డి, ఎస్.సతీష్‌కుమార్‌రెడ్డిలను మంగళవారం స్థానిక లక్ష్మీనగర్‌కాలనీలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, కోశాధికారి రాజవర్ధన్‌రెడ్డి, 30మంది మాజీ సైనికులు పాల్గొన్నారు.

కళాశాలలో హరితహారం



మిడ్జిల్: హరితహారం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను రక్షించాలని ప్రిన్సిపాల్ వెంకటయ్య సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రమేష్, చరణ్, అక్బర్, శ్రీనివాస్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల విశిష్టత వివరించాలి

నవాబుపేట: తల్లిపాల విశిష్టత అందరికి వివరించాలని ఐసీడీఎస్ సిబ్బంది సూచించారు . మంగళవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల్లో వారు పాల్గొని తల్లిపాల విశిష్టతపై వివరించారు. కార్యక్రమంలో సరస్వతీ, ప్రమీళ, అనుసూయ, విమల, ఉమాదేవి, సునీత తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ రూ.10లక్షలు ఇవ్వాలి

జడ్చర్ల టౌన్: గృహలక్ష్మి పథకం కింద అర్హులైన బీసీలందరికి బేషరతుగా రూ.10లక్షలు ఇవ్వాలని రజక సంఘం జాతీయ కన్వీనర్ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎమ్మార్పీ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్నాళ్లు ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు ఇస్తామని, రూ.3లక్షలకే పరిమితం చేయటం తగదన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఎక్కువ సమయం ఇవ్వకుండా మూడు రోజులే ఇవ్వటం వల్ల అందరు దరఖాస్తుఉ చేసుకోలేకపోతారన్నారు. పరిమిత సంఖ్యలో కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి డబ్బులివ్వాలని లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

గొడుగుల పంపిణీ

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని సంతలో రోడ్డుపై కూరగాయలు అమ్మే వారికి మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు గొడుగులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సహకారంతో గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఇంద్రయ్యసాగర్, సర్పంచ్‌లు చంద్రశేఖర్, లక్ష్మణ్, నాయకులు కొండయ్య, రవీందర్‌గౌడ్, శరత్‌గౌడ్, వెంకటేష్, అన్వర్ తదితరులు ఉన్నారు.

పోస్టాఫీసులో జాతీయ జెండాల విక్రయం

జడ్చర్ల టౌన్: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని పతాకావిష్కరణ చేసే వారికి రూ.25లకే 20నుంచి30 అంగుళాల జాతీయ పతాకం తపాలశాఖలో విక్రయిస్తున్నట్లు బాదేపల్లి తపాల కార్యాలయం అసిస్టెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ వెల్లడించారు. మంగళవారం కార్యాలయ ప్రాంగణంలో జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

అంగన్‌వాడీలో కుళ్లిన గుడ్లు

జడ్చర్ల: అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న కోడిగుడ్లు కుళ్లిపోయి పురుగులు బయటకు రావడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం మండల పరిధిలోని రామస్వామి గుట్టతండా కేంద్రంలో పంపిణీ చేసిన గుడ్లు కుళ్లిపోయి పురుగులు బయటకు వచ్చాయి. ఉడికించిన తర్వాత తీవ్ర దుర్వాసన రావడంతో విషయం వెలుగులోకి వచ్చింది. కాంట్రాక్టర్‌తో అధికారులు కుమ్మక్కై నాసిరకం గుడ్లను సరఫరా చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం నాణ్యతతో కూడిన గుడ్లను సరఫరా చేయాలని సర్పంచ్ గంగ్యానాయక్ తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- కలెక్టర్ రవినాయక్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి
- 300 మంది బీసీలకు చెక్కుల పంపిణీ



బీసీ కులవృత్తిదారులకు చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ రవినాయక్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని కలెక్టర్ రవినాయక్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో జడ్చర్ల, ఊర్కొండ, మిడ్జిల్, బాలానగర్, నవాబుపేట మండలాలకు చెందిన బీసీ కులవృత్తుల వారికి రూ.లక్ష ప్రభుత్వ సాయానికి సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ.. తిరిగి చెల్లించని విధంగా ఎలాంటి షరతులు లేకుండా బీసీ కుల వృత్తులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందజేస్తున్న సాయం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి నెల 300 మందికి చెక్కులను అందజేస్తామని, తొలి విడతలో అందని వారు ఎలాంటి అపోహలకు గురికావద్దన్నారు. గృహలక్ష్మి పథకానికి సొంత స్థలం ఉండి ఇల్లు లేని వారందరూ తెల్లకాగితంపై దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

బంగారు తెలంగాణ సాకారమైంది: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బంగారు తెలంగాణ సాకారమైందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. తమ ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉండి పండుగలు చేసుకుంటున్నారని హర్షించారు. జడ్చర్ల పట్టణంలో 850 ఇళ్లకు అర్హులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతుందని, పారదర్శకంగా ఎంపిక చేసి పంపిణీ చేస్తామన్నారు.

కరెంట్ గురించే మాట్లాడుతుండగా కరెంట్ కట్

విద్యుత్ సరఫరాకు సంబంధించి కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేస్తున్న క్రమంలో అకస్మికంగా కరెంట్ పోయి ఎమ్మెల్యే ప్రసంగానికి అంతరాయం ఏర్పడింది. ఎవరైనా కావాలని కరెంట్ తీశారా అంటూ ఎమ్మెల్యే అనడంతో సభలో అందరూ నవ్వారు. పట్టణంలో విద్యుత్ లైన్ల కింద చెట్ల కొమ్మలను తొలగిస్తున్నారన్న సమాచారంతో పాటు వెంటనే కరెంట్ రావడంతో ప్రసంగం కొనసాగింది. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జెడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి, జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, ఎంపీపీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

బీజేపీ కౌన్సిలర్‌ను తోసేసిన బీఆర్‌ఎస్ కార్యకర్త

ఎమ్మెల్యేను ప్రశ్నిస్తున్న బీజేపీ వార్డు కౌన్సిలర్ రాజును బీఆర్‌ఎస్ కార్యకర్త ఒక్కసారిగా దూసుకు వచ్చి తోసేయడంతో ఉద్రిక్త చోటు చేసుకుంది. ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యత ఇవ్వకుండా వేదికపైకి బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులకు ఎలా అవకాశం కల్పిస్తారని ప్రశ్నించారు. అక్కడే ఉన్న పోలీసులు ఘర్షణ తలెత్తకుండా ఇరువురిని వారించి పక్కకు తీసుకెళ్లారు. న్యాయంగా ప్రశ్నించిన తనపై దాడి చేయడం తగదని కౌన్సిలర్ తెలిపారు.

పరస్పర ఫిర్యాదులపై కేసులు నమోదు

తనపై బీఆర్‌ఎస్ కార్యకర్త జయరాజ్ అకారణంగా చేయి చేసుకుని దాడికి యత్నించాడన్న వార్డు కౌన్సిలర్ కుమ్మరి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. జయరాజ్‌పై అకారణంగా దాడి చేశారని ఫిర్యాదు మేరకు బీజేపీకి చెందిన శివ, మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో రఫియొద్దీన్‌షా ఖాద్రీ ఉర్సు



వేడుకల్లో పాల్గొన్న మత పెద్దలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం రామయ్య బౌలీలోగల హజ్రత్ షేక్ రఫియొద్దీన్‌షా ఖాద్రీ దర్గా ఉర్సు సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గంధోత్సవం వైభవంగా నిర్వహించారు. దర్గాలో పూలు, చాదర్లు సమర్పించి ప్రత్యేక ఫాతేహా, అనంతరం ఫంక్షన్‌హాల్లో ధార్మిక సభ నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ రఫీయొద్దీన్ హుస్సేని, మహ్మద్ మహమూద్ హుస్సేని, అబ్దుల్ మొహిమిన్, రిజ్వాన్‌పాష ఖాద్రీ, ఇఫ్తేకార్, కర్నూల్‌కు చెందిన హుస్సేని పీర్ హుస్సేని, కర్ణాటక గోగి షరీఫ్‌కు చెందిన సయ్యద్ షా చందా హుస్సేని పాల్గొని ధార్మిక సందేశాలు ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ధర్మమార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. పలువురు ఆలపించిన నాతేషరీఫ్‌లు (భక్తిగీతాలు) అలరించాయి. కార్యక్రమంలో దర్గా ముతవల్లీ షైక్ సైఫొద్దీన్ ఖాద్రీ, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ రహెమాన్, మౌలానా గయాజ్‌పాష ఖాద్రీ, వారిస్‌పాష ఖాద్రీ, జహంగీర్‌పాష ఖాద్రీ, ఇబ్రాహీం నక్షబంది, లాయఖ్ పాష ఖాద్రీ, ఖాజామైనద్దీన్, అజీజ్ మాదుం, అబ్దుల్ ఖాదర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్, జహీరుద్దీన్ అలీఖాన్‌కు నివాళి



జిల్లా కేంద్రంలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ పట్టణ విభాగం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో మంగళవారం ప్రజాగాయకుడు గద్దర్, ప్రముఖ ఉర్దూ జర్నలిస్ట్ జహీరుద్దీన్ అలీఖాన్‌లకు నివాళులర్పించారు. వారి మృతికి సంతాపకంగా రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు గులాం అహ్మద్ జహీర్ మాట్లాడుతూ గద్దర్ తన పాటలతో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రజలకు ఎక్కడ అన్యాయం జరిగినా తన పాట, మాటలతో అండగా నిలిచారని గుర్తు చేశారు. ఉర్దూ జర్నలిస్ట్ జహీరుద్దీన్ అలీఖాన్ ప్రజా సమస్యలను పత్రికా ద్వారా ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లారని అన్నారు. గద్దర్, జహీరుద్దీన్ అలీఖాన్‌ల మృతి తెలంగాణ సమజానికి తీరనిలోటు అని అన్నారు. కార్యక్రమంలో లక్ష్మణ్ యాదవ్, లింగంనాయక్, అజ్మత్‌అలీ, అవేజ్, పీర్ మహ్మద్ సాధిక్, నాగరాజు, ఫహీం, సల్మాన్, సిరాజ్, అజీజ్, తాహెర్, చావూష్, అష్ఫ, అబుబకర్, మొయిజ్, శ్రీహరినాయక్, అలీ తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: సమతాక్షర జ్యోతి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని పాతపాలమూరు జైభీమ్ చౌరస్తాలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మోహన్, ఆంజనేయులు, అశోక్, రాము, రమేష్‌బాబు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



వెంకట్‌రెడ్డిపల్లిలో గొర్రెల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

మహమ్మదాబాద్: ప్రభుత్వం కులవృత్తుల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తుందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వెంకట్‌రెడ్డిపల్లి, కంచన్‌పల్లిలో గొల్లకురుమలకు గొర్రెల పంపిణీ చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి నిరుపేదల అభ్యున్నతికి కృషి చేస్తుందని తెలిపారు. గొల్లకురుమలకు మొదటి విడతలో గొర్రెలను పంపిణీ చేయగా రెండవ విడతలో కూడా అర్హులైన వారికి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మరెన్నో పథకాల ద్వారా నిరుపేదలను ధనవంతులుగా చేసేందుకు సీఎం కేసీఆర్ ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. అందుకు మనమందరం కలిసి బీఆర్‌ఎస్‌కు అండగా ఉందామన్నారు. ప్రతి కార్యకర్త ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఎలాంటి అవసరాలు వచ్చినా ప్రజాప్రతినిధులు వారిని ఆదుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ ఈశ్వర్‌గౌడ్, అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ చించివేత..

ఫ్లెక్సీ చించివేతతో మొదలైన గొడవ చివరకు దాడి చేసే వరకు వచ్చింది. వివరాల్లోకి వెళితే మండలంలోని వెన్నాచేడ్‌లో మంగళవారం గొర్రెల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి హాజరు కానుండడంతో గొర్రెల కాపరుల సంఘం తరపున బ్యానర్ వేయించారు. అందులో సంఘానికి చెందిన చనిపోయిన వారి ఫోటోలు వేసి తమవి ఎందుకు వేయలేదని సంఘం వారిని అడిగారు. వెంటనే చనిపోయిన వారి ఫొటోలున్న బ్యానర్‌ను చించివేశారు. అక్కడి నుంచి రైతువేదికలో కార్యక్రమానికి వెళ్లారు. ఎమ్మెల్యే మాట్లాడిన తర్వాత తాము అందరం డీడీలు కడితే కొందరికే ఎలా ఇస్తారని ప్రశ్నించారు. దీంతో ఎమ్మెల్యే మూడు దశలో ఇస్తామని చెప్పారు. అలాంటప్పుడు డీడీలు ఎందుకు కట్టించారని నిలదీశారు. మీరు చేసిందేముంది కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేస్తుందని ఓ వ్యక్తి అన్నాడు. అంతకు ముందే అదే వ్యక్తి బ్యానర్ చించివేయడంతో పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆయనపై దాడి చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్తత చోటు చేసుకుంది. గొర్రెల పంపిణీ గురించి ఎమ్మెల్యేని అడిగితే తమ సంఘానికి చెందిన వారిపై దాడి చేయడం ఎంతవరకు సమంజసం వారు ప్రశ్నించారు.

వెన్నాచేడ్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి

గండేడ్: మండలంలోని వెన్నాచేడ్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి స్థానికులు వినతిపత్రం అందజేశారు. మంగళవారం వెన్నాచేడ్‌కు విచ్చేసిన ఎమ్మెల్యేను పలు గ్రామాల ప్రజలు కలిశారు. జిన్నారం, లింగాయిలపల్లి, పెద్దవార్వాల్, జక్లపల్లి, వెన్నాచేడ్ చెందిన వారు ఎమ్మెల్యేతో మాట్లాడారు. మండల కేంద్రానికి వెళ్లడానికి తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ప్రస్తుతం మండలంలో వెన్నాచేడ్ గ్రామం పెద్దదని తెలిపారు. ఎమ్మెల్యే స్పందించి మండల కేంద్రం ఏర్పాటు విషయాన్ని పరిశీలించి ఆ దిశగా కృషి చేస్తామన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు



నవాబుపేట: సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు. మంగళవారం మండలంలోని మరికల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో చట్టాలు, సైబర్ నేరలపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరగాళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థినులు మొబైల్స్ వాడకం చదువుకునే దశలో మానేయాలని సూచించారు. తల్లిదండ్రులు సైతం వారిని విలాసాలకు దూరంగా ఉంచాలన్నారు. మైనర్లకు వాహనాలు, ఫోన్లు ఇవ్వడం చేయకూడదని తెలిపారు. బాలికలు చదువుకునే వరకు చదివించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవి, సర్పంచ్ పాండు, శ్రీనివాస్, మెగిలిరెడ్డి, మహేష్, మజహర్, రవినాయక్, రాజు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు



చిన్నచింతకుంట: కౌకుంట్ల మండలం ముచ్చింతలలో మంగళవారం బోనాల పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆడపడుచులు మట్టి కుండల్లో నైవేద్యం తయారు చేసి పసుపు, కుంకుమ, వేపాకులతో కుండను అలంకరించి తలపై పెట్టుకుని ఊరేగింపుగా బయలుదేరారు. అమ్మవారి ఆలయానికి చేరుకోని ప్రదక్షిణ చేశారు. వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు.

అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: శాంతియుతంగా ధర్నా చేస్తున్న రెండవ ఏఎస్‌ఎమ్‌లను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీఐటీయూ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఫాసిద్దీన్, జిల్లా అధ్యక్షుడు జయమ్మ తెలిపారు. డిమాండ్ల సాధన కోసం మంగళవారం జిల్లా కేంద్రంలో శాంతియుతంగా ధర్నా చేస్తే అక్రమంగా అరెస్టు చేయడం తగదన్నారు.

వీఆర్‌ఏల ధ్రువపత్రాల పరిశీలన



కోయిల్‌కొండ: మండలంలోని పనిచేస్తున్న 70మంది వీఆర్‌ఏలకు పదోన్నతి ప్రభుత్వం కల్పించిందని ఇన్‌చార్జ్ తహసీల్దార్ మురళీ తెలిపారు. మంగళవారం వీఆర్‌ఏల ధ్రువపత్రాలను ఆయన పరిశీలించారు. 61ఏళ్లు పైబడి 15మంది ఉన్నారని, 61 ఏళ్ల లోపు మిగతా వారు ఉన్నారన్నారు. ఈ నివేదికను కలెక్టర్‌కు అందిస్తామన్నారు. వీరికి అర్హతను బట్టి పదవులు ఉంటాయని తెలిపారు.

గెజిట్ రూపంలో తీసుకురండి



కోయిల్‌కొండ: గార్లపహాడ్ మండలం కోసం స్థానిక ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో అడగడం సంతోషమేనని, గెజిట్ రూపంలో గార్లపహాడ్‌ను మండల ప్రకటన తీసుకరావాలని మండల సాధనసమితి కన్వీనర్ రాము నాయక్, వెంకట్రామిరెడ్డి అన్నారు. మంగళవారం 198వ రోజు నిర్వహించిన రిలేదీక్షలో వారు పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యేకు గార్లపహాడ్‌ను మండలం చేయడం పెద్ద సమస్యకాదని వెంటనే గెజిట్ తీసుకరావాలని కోరారు. వెంకటేష్, రవి, ఆంజనేయులు, నారాయణ పాల్గొన్నారు.

పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షబ్బీర్



నవాబుపేట: టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండలానికి చెందిన షబ్బీర్‌అలీ నియమితులయ్యారు. మంగళవారం పీసీసీ ఉపాధ్యక్షుడు ఎర్రశేఖర్ మండల కేంద్రంలో ఆయనకు నియామక పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ తనకు ఇచ్చిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు.

కస్తూర్బా పాఠశాలలో తీరిన నీటి సమస్య



మహమ్మదాబాద్: మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల పాఠశాలలో కొంతకాలంగా నీటి సమస్య నెలకొంది. దీంతో జెడ్పీ నిధులతో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ మాధవి బోరును వేయించారు. సరిపడు నీరు రావడంతో మంగళవారం మండల కోఆప్షన్ సభ్యుడు సలీం బోరుమోటారును బిగించి నీటిని గురుకుల పాఠశాలకు సరఫరా అయ్యేటట్టు ఏర్పాట్లు చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ లక్ష్మిబాయి విద్యార్థుల సమస్య తీర్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం



మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

గండేడ్: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే విజయమని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీకి బంగారు భవిష్యత్ ఉందని ఇప్పటి నుంచే కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలని సూచించారు. బీఆర్‌ఎస్ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. కింది స్థాయి కార్యకర్తలపైన పార్టీ మనుగడ ఆధారపడి ఉందన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక కంటి తుడుపు పథకాలతో అమరుల త్యాగాన్ని వృథా చేస్తున్నారని తెలిపారు. ప్రజలు ఎప్పటికపుడు కేసీఆర్ కల్లిబొల్లి మాటలు గమనిస్తూనే ఉన్నారని రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నరసింహారావు, జితేందర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాలయ్య, ప్రభాకర్‌రెడ్డి, బాలస్వామి, ఆశన్న, హరీందర్‌రావు పాల్గొన్నారు.

పార్టీని అధికారంలోకి తీసుకురావాలి

నవాబుపేట: కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేలా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని దేపల్లి చెందిన వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో వివిధ పార్టీల యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో శివరాజు, యాదయ్య, శేఖర్, శ్రీకాంత్, వినోద్, శంకర్ తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

జడ్చర్ల టౌన్: ఇందిరా ప్రియదర్శిని ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం భవనంలో మంగళవారం కేంద్ర ప్రభుత్వ పథకాలపై కార్మికులకు అవగాహన సదస్సునిర్వహించారు. కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ రీజినల్ డైరెక్టర్ రంగనాథ్ హాజరై మాట్లాడారు. అసంఘటిత కార్మికులు, కూలీలు, చిరువ్యాపారుల కోసం పీఎంకేవీవై, పీఎంఎస్‌ఎంవై, ఏపీవై, ఎన్‌పీఎస్, ఎస్‌ఎస్‌ఎస్, స్వయం ఉపాధి పథకాల గురించి వివరించి వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సదస్సులో గోవర్ధని, లీడ్ బ్యాంక్ మేనేజర్ భాస్కర్‌రావు పాల్గొన్నారు.

ఉద్యోగులకు అండగా ఉంటా.. : మంత్రి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఎల్లప్పుడు ఉద్యోగులకు అండగా ఉంటానని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఉద్యోగులకు పీఆర్‌సీ ఇస్తామని సీఎం అసెంబ్లీలో ప్రకటించిన సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో మంత్రిని ఉద్యోగ సంఘాల నాయకులు కలిశారు. మంత్రితో పాటు కలెక్టర్ రవి నాయక్, ఎస్పీ నర్సింహలను సన్మానించారు. మంత్రి మాట్లాడూత.. సీఎం కేసీఆర్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు సానుకూలంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ జిల్లా అధ్యేఉడు రాజీవ్‌రెడ్డి, చంద్రనాయక్, క్రాంతికుమార్‌గౌడ్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నరేందర్, శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణకుమార్, దామోదర్, మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సంతలో ఫోన్ చోరీ

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని వారాంతపు కూరగాయల సంతలో ఓ యువకుడి మొబైల్ ఫోన్ చోరీకి గురైంది. సంకలమద్దికి చెందిన బేకరి నిర్వాహకుడు సిద్దు కూరగాయల కోసం సంతకు వెళ్లారు. ఈక్రమంలో జేబులో ఉన్న ఫోన్‌ను గుర్తు తెలియని దొంగ తస్కరించాడు. కొంతసేపటి తర్వాత విషయాన్ని గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తర్వాత పోగొట్టుకున్న మొబైల్‌కు ఫోన్ చేయగా ఫోన్ ఎత్తిన దొంగ ఫోన్ లాక్ నంబర్ చెప్పాలని అడిగాడు. ఎక్కడున్నవో చెబితే వచ్చి చెప్తానని చెప్పగా పెబ్బేర్ బైపాస్‌లో ఉన్నట్లు చెప్పి ఫోన్‌ను దొంగ స్విచ్ఛాఫ్ చేసినట్లు బాధితుడు వాపోయాడు.

మెరుగైన విద్య అందించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని డీఈఓ రవీందర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్వీఎం సమావేశ మందిరంలో ఐఎఫ్‌పీ ప్యానెల్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీఎంఓ బాలుయాదవ్, ఏఎంఓ శ్రీనివాస్, కోఆర్డినేటర్ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

12న చలో హైదరాబాద్ జయప్రదం చేద్దాం



జడ్చర్లలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

జడ్చర్ల టౌన్: సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న తలపెట్టిన చలో హైదరాబాద్ జయప్రదం చేద్దామని ఉద్యోగ, ఉపాధ్యాయులకు టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు బాలస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని పాఠశాలలో పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా కేంద్రం నుంచి బస్సులు హైదరాబాద్ బయలుదేరుతాయని, కుటుంబ సభ్యులతో కలిసి రావాలన్నారు. మన కుటుంబాలకు సామాజిక భద్రతకోసమే పాత పింఛన్ విధానం అమలు చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మంజులాదేవి, చంద్రకాంత్, రాఘవేంద్ర, రమేష్‌నాయక్, సత్యనారాయణ, సుధీర్, కృష్ణ, థారాసింగ్, వెంకటేశ్, శివరాములు, పూర్ణ, మాధవి పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయండి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 12న నిర్వహించే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, రవికుమార్, ఆదిత్య, వెంకటేశ్వర్లు, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' గడువు పెంచాలని డిమాండ్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రభుత్వం చేపట్టిన గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువును నెల రోజులకు పెంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులం, ఆదాయం, పొజిషన్ సర్టిఫికేట్, బ్యాంక్ ఖాతా జిరాక్స్‌లు జత చేసి దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం కోరిందని, వాటిని పొందాలంటే కనీసం 15 రోజుల సమయం పడుతుందని తెలిపారు. నిజమైన పేదలకు పథకం ద్వారా లబ్ధి పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

'గృహలక్ష్మి'కి దరఖాస్తుల స్వీకరణ



మూసాపేటలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు



జడ్చర్లలో దరఖాస్తులు స్వీకరిస్తున్న మున్సిపల్ సిబ్బంది

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండల కేంద్రాల్లో మంగళవారం గృహలక్ష్మి పథకానికి అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. రెండు మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల వద్ద దరఖాస్తులను తీసుకున్నారు. అడ్డాకులలో 68 మంది, మూసాపేటలో 56 మంది దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

జడ్చర్ల టౌన్: గృహలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకునే వారికోసం మున్సిపాలిటీలో రెండు కౌంటర్లు ఏర్పాటయ్యాయి. మున్సిపల్ పాత కార్యాలయం బాదేపల్లి వద్ద, కావేరమ్మపేట కార్యాలయం వద్ద రెండో కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ మహమూద్‌షేక్ తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల వారు దరఖాస్తు చేసుకోవాలంటే నేరుగా ఎంపీడీఓ కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందని ఎంపీడీఓ ఉమాదేవి తెలిపారు.

కోయిల్‌కొండ: మండలంలోని ఆయా గ్రామాల నుంచి గృహలక్ష్మి పథకానికి మొదటి రోజు 401 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ జయరాములు తెలిపారు. పంచాయతీ కార్యదర్శికి ఈనెల 10వ తేదీ వరకు దరఖాస్తులు ఇవ్వాలని తెలిపారు.

చిన్నచింతకుంట: ఎంపీడీఓ కార్యాలయంలో మొదటి రోజు 188 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

దేవరకద్ర: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం 161 మంది దరఖాస్తులు చేసుకున్నారని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. దేవరకద్రకు సంబంధించి 131, కౌకుంట్ల మండలానికి సంబంధించి 30 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.